క్లుప్తంగా

నేడు పర్చూరులో 'జగనన్నే మా భవిష్యత్తు'

పర్చూరు: మండల కేంద్రమైన పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కళ్యాణ మండపంలో నేటి ఉదయం 10 గంటలకు 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పాల్గొననున్నట్లు ఆపార్టీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. కావున జెడ్పీటీసీలు, ఎంపీపీ, మండల కన్వీనర్లు, సర్పంచులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వివిధ హోదాల్లో ఉన్న ప్రతినిధులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్యల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

వేటపాలెం: రామన్నపేటలో వేంచేసియున్నలో లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యల దేవస్థానం వద్ద అమ్మవారి కల్యాణ మహోత్సవం గురువారం పండితులు వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిరుపతమ్మ కల్యాణాన్ని తిలకించి పూజల చేశారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు. స్థానిక బైపాస్ రోడ్డు జంక్షన్ వద్దగల తిరుణాళ్ల మహోత్సవం సందర్భంగా అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అనాథాశ్రమ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న కబీర్‌బాషా కుటుంబం

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నిర్మాణం జరుపుకుంటున్న అమ్మ అనాథాశ్రమ నూతన భవన నిర్మాణానికై దాతలు గురువారం రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మార్టూరుకు చెందిన ఇరిగేషన్ ఇంజనీరు షేక్ కబీర్‌బాషా, నూర్జహాన్ దంపతులు నగదు ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందుకు అందజేశారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు బస్టాండ్ సెంటర్‌లో గురువారం ఉచిత చలివేంద్రాన్ని గురువారం మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిణి వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుడిపూడి రామారావు ప్రారంభించారు. చలివేంద్రాన్ని సీకేఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాస్టర్ షడ్రక్ నిర్వహిస్తున్నాడు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద నక్కలపాలెంలో నేత్రదానం


అంజమ్మ (ఫైల్)

చినగంజాం: ఇంకొల్లు మండలంలోని పెద నక్కలపాలెంలో గురువారం మృతి చెందిన పొనుగుపాటి అంజమ్మ (82) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, వెంకటరత్నం, పద్మల అంగీకారం మేరకు గుంటూరు శంకర నేత్రాలయం వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, ట్రెజరర్‌లు భవనం అంజిరెడ్డి, కరి కమలేశ్వరరావు, శ్రీమన్నారాయణలు దాత కుటుంబ సభ్యులను అభినందించారు. రోటరీ క్లబ్ 494వ నేత్రదానం ఇది.

దేవరపల్లిలో 104 వాహనం ప్రారంభం


వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పర్చూరు: మండల పరిధిలోని దేవరపల్లి గ్రామంలో 104 వాహనాన్ని సర్పంచ్ పలతోటి లాజరు, ఉపసర్పంచ్ తోకల కృష్ణమోహన్ గురువారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో డాక్టరు గోరంట్ల సురేష్ వందకు పైగా గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ జయశ్రీ, కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటివద్దకే వైద్యం


104ను ప్రారంభిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణ చైతన్య


మేదరమెట్లలో 104 వాహనాన్ని ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

- దేశానికే ఆదర్శం.. మన రాష్ట్రం
- ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని ప్రారంభించిన రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

అద్దంకి/మేదరమెట్ల: 'ఫ్యామిలీ డాక్టర్' పథకంతో ఇంటికే డాక్టర్ వచ్చి వైద్యం అందిస్తారని రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని చక్రాయపాలెం గ్రామంలో 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా 104 అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. గతంలో మాదిరిగా ఇక డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డాక్టరే ఇంటికి వచ్చి వైద్యం చేసే పథకాన్ని ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టాడని చెప్పారు. దీంతో డాక్టర్ ఇంటికి వచ్చి ఎవరికి ఏయే పరీక్షలు చేయాలో చేసి, ఉచితంగా మందులు ఇస్తారన్నారు. కార్పొరేట్ వైద్యశాలలకు వెళ్లి డబ్బు ఖర్చు చేసుకోకుండా ఇంటి వద్దకే వస్తున్న డాక్టర్ సేవలను ప్రజలంతా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నగేశ్, మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయచంద్రరావు, నవ్యారెడ్డి, మండల కన్వీనర్ జ్యోతి హనుమంతరావు, అవిశన ప్రభాకర్‌రెడ్డి, ఆరోగ్య శాఖ సిబ్బంది, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలకు కూడా మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో సీఎం జగన్ ప్రాథమిక వైద్యశాలల్లో అదనంగా 104 వాహనాలు ఏర్పాటు చేశారని, అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కృష్ణచైతన్య అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో యర్రం చిన పోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాలలో 104 వాహనాన్ని చైతన్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, ఎంపీడీవో సురేష్‌బాబు, డాక్టర్ ఎన్వీ సుబ్బారావు, వైద్యశాల సిబ్బంది, గ్రామస్తులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ పథకంతో మన ఊరిలోనే మన ఇంటి వద్దకే వైద్యం అందుబాటులోకి వస్తుందని సంతమాగులూరు ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ నిర్మల్ కుమార్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని సజ్జాపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఇంటి వద్దనే 14 రకాల వైద్య పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు ఏ యలమంద, సర్పంచ్ అనంతవరపు మార్తమ్మ, ఎంపీహెచ్‌ఈవో ఎం భూపాల్‌రెడ్డి, సీహెచ్‌ఓలు దివ్యజ్యోతి, సాయి నాయక్, సూపర్ వైజర్స్ రవి, సత్యనారాయణరెడ్డి, ఆశవర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంకల్పం పేదలకు వరం..

స్వర్ణ(కారంచేడు)/చినగంజాం: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్ప దీక్ష ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని స్వర్ణ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హస్మప్రియ అన్నారు. ఆమె మండలంలోని స్వర్ణ పీహెచ్‌సీ పరిధిలో 104 వాహనం ద్వారా 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటాని మధుసూదనరావు, హెచ్‌ఈ మీనాకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఫ్యామిలీ డాక్టర్ పథకాన్ని కడవకుదురు గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి సంతరావూరు ప్రాథమిక ఆరోగ్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి బీ నాగేంద్ర, పాదిలి రాఘవ, విద్యాకమిటీ చైర్మన్ జీవీ రామకృష్ణారెడ్డి, ఎంపీహెచ్‌ఏ జీవీ ప్రసన్న కుమార్, వెంకట రమణ, ఎంఎల్‌హెచ్‌పీ రమ్య, ఏఎన్‌ఎం శారద, ఆశ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.


సంతమాగులూరులో పథకాన్ని ప్రారంభిస్తున్న వైద్యాధికారి నిర్మల్ కుమార్


స్వర్ణలో ఫ్యామిలీ డాక్టర్ ప్రారంభోత్సవంలో డాక్టర్, వైద్య సిబ్బంది


చినగంజాంలో మాట్లాడుతున్న సర్పంచ్ శివకుమారి


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం బలరాం, ఇన్‌చార్జి వెంకటేష్

మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం ప్రత్యేక కృషి

- ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే కరణం బలరాం

చీరాల: మహిళల ఆర్థికాభివృద్ధి చెందేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టడంతో పాటు అన్నీరంగాల్లో మహిళలకు అగ్ర ప్రాధాన్యత కల్పించారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్ మైదానంలో మున్సిపాలిటీలోని మెప్మా విభాగం ఆధ్వర్యంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మెప్మా మహిళలతో కలిసి ఎమ్మెల్యే కరణం, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతవరకు జరగని విధంగా మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ, కార్పొరేషన్లలో నామినేటెడ్ పదవులు కల్పించి మహిళలకు అగ్రభాగం కల్పించిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరడంతో పాటుగా సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రోత్సాహకాలు, రుణాలు, ఉన్నతి పథకం ద్వారా ఆర్థిక చేయూతనందించారన్నారు. ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చి మేనిఫెస్టోలోని ప్రతీ హామీని ప్రజలకు చేరువచేశారన్నారు. అనంతరం మెప్మాలోని 952 పొదుపు సంఘాలకు రూ.6.88 కోట్ల చెక్కులను వెంకటేష్‌తో కలిసి ఎమ్మెల్యే బలరాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సరోజిని, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, తహసీల్దార్ జీ. ప్రభాకరరావు, వైస్‌చైర్మన్లు జైసన్‌బాబు, రామసుబ్బులు, మెప్మా పీడీ రవి, కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎం.వైష్ణవి, జి.శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

ఇంకొల్లులో బాలుడు అదృశ్యం


సృజన్ (ఫైల్)

చినగంజాం: సిగరెట్ తాగడం తప్పు అని తల్లి మందలించినందుకు ఇంట్లో నుంచి అలిగి వెళ్లిన బాలుడు ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఇంకొల్లు ఎస్సై ఎస్కే నాయబ్ రసూల్ అందించిన సమాచారం ప్రకారం ఇంకొల్లు గ్రామానికి చెందిన కుంభా గోపి కుమారుడు కుంబా సృజన్ అనే 13 ఏళ్ల బాలుడు ఇంకొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. బాలుడు ఈ నెల 4వ తేదీ ఇంటి వద్ద సిగరెట్ తాగుతుండగా తల్లి కుంభా రత్నాలు కంటపడింది. దాంతో అతనిని సిగరెట్ తాగడం తప్పు అని మందలించడంతో బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. దాంతో తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. బాలుడు ఆచూకీ తెలిపిన వారు తల్లి రత్నాలు 84669 38321, ఎస్సై 91211 02148 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

కమనీయం చెన్నకేశవస్వామి కల్యాణం


శ్రీదేవి-భూదేవి సమేత చెన్నకేశవస్వామి వారు

బల్లికురవ: కొనిదెన గ్రామంలోని కొండపై వేంచేసి ఉన్న శ్రీదేవి-భూదేవి సమేత చెన్నకేశవస్వామి వార్షిక కల్యాణం గురువారం వేదమంత్రోచ్ఛరణలతో కనులపండువగా జరిగింది. ఆలయ అర్చకుడు ఐ. శోభనాచార్యులచే అమ్మవారిపురంలో ఉన్న అమ్మవార్లను కల్యాణం వేదికవద్దకు తీసుకొచ్చి రెండు గంటలపాటు ఉత్సవ విగ్రహాలకు కల్యాణం తంతు ముగించారు. కొత్తపాలెంలో వేంచేసి ఉన్న పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక కల్యాణాన్ని అర్చకుడు నాగేశ్వరరావు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేశారు.

కాపీయింగ్‌కు పాల్పడితే భవిష్యత్ అంధకారం


చినగంజాం: సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ పార్వతి

కారంచేడు/పర్చూరు/చినగంజాం: పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవద్దని తహసీల్దారు ఎస్. వెంకటరత్నం అన్నారు. గురువారం ఆయన మండలంలోని స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని ఎస్సై ఎం అనితతో కలసి పరిశీలించారు. 145 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎగ్జామ్ చీఫ్ మూకిరి దేవదత్తం తెలిపారు. కార్యక్రమంలో డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ హైమావతీ, సిట్టింగ్ స్క్వాడ్ మధుసూదనరావు పాల్గొన్నారు.

➤ మాస్ కాపీయింగ్‌కు ఎటువంటి అవకాశం లేకుండా పరీక్షల నిర్వాహణ ఉండాలని తహసీల్దార్ పీ పార్వతి సూచించారు. మండలంలోని కడవకుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పది పరీక్ష కేంద్రాన్ని ఆమె సందర్శించి తనిఖీ చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ బీ ప్రసన్నకుమారితో కలిసి పలు సూచనలు చేశారు.

➤ పదో తరగతి పరీక్ష భాగంగా హిందీ పరీక్షకు నాలుగు కేంద్రాల్లో మొత్తం 637 మంది విద్యార్థులకుగాను 633 మంది హాజరైనట్లు పర్చూరు ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు.

చీరాల టౌన్: హిందీ పరీక్షకు 1607 మంది విద్యార్థులకుగాను 1603 మంది హాజరుకాగా నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో నాగేశ్వరరావు తెలిపారు. హిందీ పరీక్ష జరుగుతున్న కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ నిరంజన్, ఎంఈవో పరిశీలించారు.

ద్రోణాదులలో ఉద్రిక్తత

మార్టూరు: మండలంలోని ద్రోణాదుల గ్రామంలో గ్రామ సర్పంచ్‌కు ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం చోటు చేసుకుంది. గ్రామంలో నివాసముంటున్న శానంపూడి సురేంద్ర, అమరా శ్యాంబాబులతో సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావుల మధ్య గురువారం సాయంత్రం ఓ విషయంలో వాగ్వాదం చోటుచేసుకుంది. వారి మధ్య మాటామాటా పెరిగి వివాదం పెద్దదైంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాల స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు. బాపట్ల డీఎస్పీ సైతం ద్రోణాదుల చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు.

అవగాహనతో పోటీ పరీక్షలో గెలుపు


మాట్లాడుతున్న కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ కృష్ణసాగర్‌రెడ్డి

అద్దంకి రూరల్: సబ్జెక్ట్‌పై అవగాహన పెంచుకుంటే పోటీపరీక్షలో విజయం సాధించవచ్చని కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ జీ. కృష్ణసాగర్ రెడ్డి అన్నారు. గురువారం శింగరకొండ సమీపంలోని కేఈఆర్కే డీగ్రీ కళాశాలలో ఉద్యోగ పోటీపరీక్షలకు ఎలా సిద్ధం కావాలనే అంశంపై విద్యార్థులకు మెలుకువలు వివరించారు. కార్యక్రమంలో కెరియర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్ పీవీ హేమలత, సభ్యులు ప్రసాద్, ఇన్‌క్లూజివ్ సెంటర్ కోఆర్డినేటర్ వీబీ వీఎస్ రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌రావు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న గోరుముద్ద ఓ వరం

బల్లికురవ: విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలన్నే ధ్యేయంతో అందజేస్తున్న జగనన్న గోరుముద్ద ఓ వరం అని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం బీ. సురేంద్రబాబు అన్నారు. గురువారం కొప్పరపాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. ప్రతి రోజు మెనూ ప్రకారం భోజనం వండి వడ్డిస్తూ అందరూ విద్యార్థులు పాఠశాలలో భోజనం తినేలా అవగాహన పెంపొందించాలని ఉపాధ్యాయులను కోరారు. తనిఖీలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ విష్ణు ప్రసాద్ పీఎంసీ చైర్మన్, దమ్ము అంజయ్య పాల్గొన్నారు.

న్యాయవాదుల గుమాస్తాల సంఘ అధ్యక్షుడిగా అంజయ్య


సగ్గం అంజయ్య

అద్దంకి రూరల్: అద్దంకి కోర్టు భవనాల ఆవరణలో గురువారం జరిగిన న్యాయవాదుల గుమాస్తాల సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సగ్గం అంజయ్య, ఉపాధ్యక్షుడిగా పరిటాల సుబ్బారావు, కార్యదర్శిగా ప్రీతమ్, కోశాధికారిగా పాదర్తి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా సునీల్ కుమార్, గౌరవాధ్యక్షుడిగా సందిరెడ్డి లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు.

ప్రజల బంగారు భవిష్యత్ జగనన్నతోనే..


కారంచేడులో 'మా నమ్మకం నువ్వే జగన్' పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కారంచేడు/పర్చూరు: ప్రజల బంగారు భవిష్యత్ జగనన్నతోనే సాధ్యమని ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు యార్లగడ్డ రజనీ శ్రీనివాసరావులు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో జేసీఎస్ మండల కన్వీనర్ యార్లగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మానమ్మకం నవ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా సచివాలయ కన్వీనర్లకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరికీ బంగారు భవిష్యత్ జగనన్నతోనే సాధ్యమన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు, మండల కోఆప్షన్ మెంబర్ ముల్లా నూర్ అహ్మద్, మాజీ సర్పంచ్ కారుమూడి సుబ్బారెడ్డి, చల్లా సుబ్బారెడ్డి, దగ్గుబాటి రామకృష్ణ, యార్లగడ్డ పాపారావు, కొడాలి ధర్మారావు, రామాంజనేయులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

☛ నవరత్నాలలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని జేసీఎస్ మండల కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య అన్నారు. పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు లబ్ధిదారుల అనుమతితో డోర్లకు స్టిక్కర్లు అతికించాలని తెలిపారు. అనంతరం వారికి మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనరు కఠారి అప్పారావు, మాజీ ఎంపీపీ కోట హరిప్రసాద్, కోఆప్షన్ సభ్యులు షేక్ కాలేషావలి, నాయకులు లంకా శివ, ఒగ్గిశెట్టి శివనాగప్రసాద్, కంచనపల్లి రమేష్, మల్లా శ్రీనివాసరావు, తులసీ అప్పారావు, కోట శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్ ఇంటింటి ప్రచారం చేయాలి..

అద్దంకి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని ఇంటింటి ప్రచారం నిర్వహించాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి ఇస్తర్ల వెంకటరావు అన్నారు. గురువారం మండలంలోని కలవకూరు గ్రామంలోని సచివాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై అవగాహన నిర్వహించారు. నేటి నుంచి 20వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కలవకూరు సచివాలయ కన్వీనర్ పోలకమ్మ వెంకటరమణ, వై సురేష్, సీహెచ్ మల్లికార్జునరెడ్డి, ఎంపీటీసీ వై అంజలి, సుబ్బారావు, ఆదిరెడ్డి పీ. వెంకటేశ్వరరెడ్డి, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


పర్చూరులో మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ రాఘవయ్య


కలవకూరులో అవగాహన కల్పిస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి వెంకటరావు

బైక్ లారీ ఢీ, ఇద్దరికి గాయాలు

మార్టూరు: అకస్మాత్తుగా లారీ పక్కకు తిరగడంతో వెనుక వస్తున్న బైక్ అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈప్రమాదం మార్టూరు నాగరాజుపల్లి రోడ్డులో గురువారం చోటు చేసుకుంది. 108 సిబ్బంది వివరాల మేరకు.. ప్రకారం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన దివ్వె వేణు, కుందేటి హనుమంతరావు వ్యక్తిగత పనుల మీద మార్టూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో వీరి బైక్ ముందు వెళ్తున్న లారీ స్థానిక లక్ష్మీసుధా వేబ్రిడ్జిలోకి ఒక్కసారిగా మలుపు తిరగడంతో బైక్ అదుపుతప్పి లారీని ఢీకొట్టింది. ప్రమాదంలో వేణు, హనుమంతరావులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన ఇరువురిని ముందుగా మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వేణుని మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేట ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు.

మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి


మాట్లాడుతున్న ఏపీవో గాయత్రి

అద్దంకి: మండల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎంపీపీ అవిశన జ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీడీవో ప్రద్యుమ్న కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. దీనిలో భాగంగా ఉద్యానశాఖ అధికారి దీప్తి మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందన్నారు. అలాగే వ్యవసాయశాఖ ద్వారా శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని, మద్దతు ధరకు శనగలను కొనుగోలు చేస్తారన్నారు. ఏపీఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి సురక్ష యోజన పథకం మహిళలకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని చెప్పారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మోహనరావు, ఏపీవో గాయత్రి, లైబ్రరియన్ సుగుణరావు, రెవెన్యూ, పంచాయతీరాజ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను వివరించారు. కార్యక్రమంలో అధికారులు, సెక్రటరీలు, ఎంపీటీసీలు, ఉపాధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.